## రిపోర్టులు

# కారంచేడు : ఇది తొలి హరిజనం కాదు

ముందుగానే వేసుకున్న పథకం ప్రకారం జులై 17 ఉదయం కారంచేడు భూస్వాముల పాశవికదాడిలో ఆరుమంది హరిజనులు గొడ్డళ్ళతో, బరిసెలతో నరికి చంపబడ్డారు. ముగ్గురు స్త్రీలు మానభంగం లైంగిక అత్యాచారాలకు గురయ్యారు. ఎంతోమంది తీవ్రమైన గాయాలతో ఇంకా హాస్పిటల్‌లో ఉన్నారు. మాదిగపల్లిలోని ఇళ్ళు ధ్వంసం చేయబడ్డాయి. హరిజనులందరూ నిరాశ్రయులై ప్రాణాలు అరచేతబట్టుకుని చీరాలలో తలదాచుకుంటున్నారు. పదిరికుప్పం, బండారుపల్లి, వెంకటకృష్ణాపురం ఫక్కీలో జరిగిన ఈఘటన జనతాహయాంలో బెల్చి మారణకాండను (1978) మరపించేదిగా ఉంది. కోటికి పడగలెత్తిన భూస్వాములు, రాష్ట్రరాజకీయనాయకులు (ముఖ్యమంత్రి బంధువర్గం), సినిమాప్రొడ్యూసర్లు, పరిశ్రమాధిపతులకు నిలయమైన కారంచేడుగ్రామం ప్రకాశంజిల్లా చీరాల తాలూకా లోనిది. నగరాలను మరపించే భవంతులతో నిండిన ఈ గ్రామం ఆంధ్రలో ఎంతో అభివృద్ధి చెందినగ్రామంగా చెప్పుకుంటారు. అయితే

ఇంత "అభివృద్ధి" చెందిన గ్రామంలో వ్యవసాయకూలీల పరిస్థితి మధ్యయుగాలను గుర్తుకు తెస్తుంది. పాలేరుకు సంవత్సర జీతం రెండువేల రూపాయలుమాత్రమే. నాట్లువేసేకాలంలో స్త్రీలకు 6 నుంచి 8 రూపాయలు. పురుషులకు 10 నుండి 12 రూపాయలకు మించి ఉండదు. ఈ కూలిరేట్లు పరిసర గ్రామాలకంటె తక్కువకావడమే కాక, అభివృద్ధి చెందిన ప్రాంతానికి (జోన్1) వర్తించే కనీసవేతనాల కంటె గూడ తక్కువ.

వేతనాలు మాత్రమేకాక మొత్తం పనిపరిస్థితులు మధ్యయుగాలను తలపించేటట్లున్నాయి. పొలాన్ని పాలికి (Crop-share) తీసుకునే రైతు రెండురకాల ఏర్పాట్లలో ఒకటి ఎంచుకోవాలి. ఒక ఏర్పాటులో ఖర్చులన్నీ రైతే పెట్టుకొని పంటలో సగం భూస్వామికి ఇవ్వాలి. లెక్కవేసిచూస్తే ఈ ఏర్పాటులో రైతుకు తినడానికిగూడ సరిగ్గా మిగలదు. మరొక ఏర్పాటులో భూస్వామి ఎరువులు మందులు ఖర్చుపెట్టుకొని కొంత మొత్తం అడ్వాన్స్ ఇస్తాడు. పంటలోమూడింట రెండువంతులు అతనికి ఇవ్వాలి. అయితే ఈ ఏర్పాటును అంగీకరించేరైతు భూస్వామి యింట్లోనూ, భూస్వామి పొలంలోనూ వెట్టి చాకిరీ చేయాలి ఈ చాకిరీ ఉదయం 4-30 గంటలకు భూస్వామి ఇంటిదగ్గర మొదలవుతుంది. ఉదయం గుడిలో గంటమోగే సరికి(దీనిని హరేరామ గంట అంటారట) భూస్వామి యింట్లో వుండాలి. అప్పటి నుండి రాత్రి 10 గంటలదాకా (అంటే దాదాపు 16 గంటలు) పని చేయాలి. ఇందులో తాను పాలికి తీసుకున్న పొలంలో చేసేపనికంటే భూస్వామి యింట్లో పొలంలో చేసేదే ఎక్కువఉంటుంది. ఈశ్రమకు దినకూలి 4 రూపాయలు మాత్రం ఇస్తారు. అంటే పొలాన్ని పాలికి ఇవ్వడం అనే షరతుమీద భూస్వాములు కారుచవకగా కూలివాళ్ళ శ్రమశక్తిని కొనుక్కుంటున్నారు. అయినప్పటికీ ఈ ఏర్పాటులోనే భద్రత ఎక్కువగా ఉన్నట్టు అనిపించి కూలివాళ్ళు దీనినే ఎక్కువగా ఆశ్రయిస్తారట! ఈ ఏర్పాటు వెట్టిచాకిరీ (రద్దు) చట్టం, 1975కు కనీసవేతనాల చట్టానికి విరుద్ధమని వేరేచెప్పనవసరంలేదు.

ఇంతేగాక పని పరిస్థితులు చాలా కఠోరంగా వున్నట్టు హరిజనులతో మాట్లాడితే తెలుస్తుంది. పాలేరు ఒక్కరోజుగాని పనిలోకి వెళ్ళకపోతే అతన్ని భౌతికంగా దండిస్తారు. జాగర్లమూడి తిరుపతయ్య దగ్గర పనిచేసిన పిల్లి సుబ్బారావు అనే యువకుడు ఒకనాడు పనిలోనికి పోకపోతే ఆ సాయంత్రం భూస్వాములు అతని యింటికి వచ్చి అతని రోగిష్టిభార్య అంకమ్మను కొట్టి పోయారట. (ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే పాలేర్లకు సంవత్సరంలోకొన్ని దినాలు జీతంతో సెలవు ఇవ్వాలని కనీసవేతనాల చట్టం అంటుంది) అదేవిధంగా ఒకపాలేరుగాని 9 నెలలు పనిచేసి ఆ తరువాత ఏ కారణంగానయినా పనిమానేస్తే, అతనికి చేసిన 9నెలల పనికిగూడవేతనం ఇవ్వరు.

గ్రామంలోని 450 హరిజన కుటుంబాలు (300 మాదిగ, 150 మాల) ఈ పరిస్థితులలో జీవిస్తున్నారు. వాళ్ళు తిరగబడే ప్రయత్నం చేయకపోయినా అప్పుడప్పుడు సంఘటితమయ్యే ప్రయత్నాలు జరగకపోలేదు. ఆ ప్రయత్నాలేవీ భూస్వాములు సాగనివ్వలేదు. ఎవరయినా కూలివాళ్ళు 'తప్పులు' చేస్తే భూస్వాములంతా అప్పటికప్పుడు చావడిలో "కచ్చేరీ" (పంచాయితీ) జరిపి దండించేవారు. అయితే గత రెండు సంవత్సరాలుగా కారంచేడుకు బయట వూళ్ళనుండి వచ్చిన కొందరు హరిజన యువకుల ప్రభావం వల్ల వాళ్ళలో కదలిక మొదలయింది. పెద్దగా పోరాటాలు చేయకపోయినా తమ హక్కుల కోసం నిలబడడం, మాటకు మాట అనడం అలవర్చుకున్నారు. భూస్వాముల భాషలో చెప్పాలంటే, తాము వస్తే లేచి నిలబడడంలేదని సిగరెట్ పారేయడం లేదని అనాలి.

ఈ విపరీత పరిస్థితులు కారంచేడుకు కొత్తకాదుగాని, కారంచేడులో భూస్వాముల కులం అయిన కమ్మ కులస్తులు, మొత్తం 12,000జనాభాలో 50శాతం పైగా ఉండడంవిపరీతపరిణామాలకు దారితీసింది. చాలా కాలంగా రాజుకుంటున్న సంఘర్షణ గత ఎన్నికలలో భూస్వాములు తెలుగుదేశం పార్టీకి, హరిజనులలో మెజారిటీ కాంగ్రెస్ (ఐ)కి వోటువేయడంతో పరాకాష్ఠ నందుకుంది. ఈ కోణం నుండి చూస్తే కారంచేడు సంఘటనలో ఎటువంటి వైపరీత్యంలేదు. 1983నుండి గూడ (పదిరికుప్పం హత్యాకాండతో మొదలుపెట్టి) తెలుగు దేశం మద్దతు దార్లయిన భూస్వాములు తమ రాజకీయ ప్రత్యర్థులను గృహదహనానికీ మారణకాండకూ గురిచేస్తూనే వున్నారు.

## జులై 16-17 సంఘటనలు

జులై 16 సాయంత్రం హరిజనులు ఉపయోగించే మంచినీటి చెరువు దగ్గర శ్రీనివాసరావు, రాయినీడు ప్రసాద్ అనే కమ్మ కులస్థులయిన యువకులకు, కత్తి చంద్రయ్య, మున్నంగి సువార్త అనే హరిజనులకు తగాదా జరిగింది. గేదెకు పెడుతున్న కుడితినీళ్ళు చెరువులోకి పోతున్నాయని హరిజనులు అభ్యంతరం తెలిపారు. కమ్మ యువకులు చంద్రయ్యను, సువార్తను చంద్రకోలతో కొట్టారు. సువార్త ఆ చంద్రకోలను లాక్కొని తిరిగి ఒకదెబ్బవేసింది. ఆరాత్రి కమ్మ యువకులు కొందరు సువార్త యింటికిపోయి ఆమెను బయటకులాగే ప్రయత్నం చేశారుగాని, హరిజనులలో కొందరు పెద్ద మనుషులు (పందిరి నాగేశ్వరరావు తదితరులు) సర్ది చెప్పగా వెళ్ళిపోయారు. అయితే సువార్త మామగారయిన మున్నంగి అంకయ్య పొద్దున్నవచ్చి తన కోడలి ప్రవర్తనకు సంజాయిషీ చెప్పుకోవాలని చెప్పిపోయారు.

మర్నాటి ఉదయం అంకయ్య తన యజమాని అయిన మండవ రాధాకృష్ణమూర్తి యింటికిపోయి, జరిగిన విషయాన్ని వివరించి, అందులో సంజాయిషీ చెప్పుకోవడానికి ఏమి లేదన్నాడు. అదే సమయంలో పందిరి నాగేశ్వరరావు టీ తాగడానికి అగ్రవర్ణాల వారి ఇళ్ళ దగ్గర ఒక దుకాణానికి పోయాడు. కమ్మ కులస్థులయిన యువకులు కొందరు అతన్ని అక్కడే పట్టుకొని "వీడు తగాదాలు పరిష్కారం చేసేంత పెద్దమనిషి అయ్యాడు" అని కొట్టి అక్కడినుండి రాధాకృష్ణమూర్తి ఇంటికిపోయి, అంకయ్యను బయటకు పంపియ్యమని అడిగారు. ఆయన అంకయ్యను కాపాడే ప్రయత్నం చేశాడుగాని ఆ యువకులు అతన్ని లాక్కుపోయారు. లాక్కుపోయి, బందిలిదొడ్డిదగ్గర కూర్చోబెట్టి, మాదిగపల్లి మీదికి దాడికి బయలుదేరారు.

ఇక్కడ చెప్పవలసిన ముఖ్య విషయంమేమిటంటే, ఇదంతా యాదృచ్ఛికంగా జరిగిందికాదు. 16నాటి రాత్రి ఈ యువకులు రాయినీడు ప్రసాద్‌కు చెందిన బ్రాందీషాపులో కూర్చొని పథకం వేసుకున్నట్టు స్పష్టమయిన ఆధారాలున్నాయి.

ఇక ఆ తరువాత జరిగిన దాడిని వర్ణించడం కష్టం. వందల సంఖ్యలో (అంచనాలు 400 నుండి 3000 దాకా వున్నాయి. యువకులు కులంపేరిట బహిరంగంగా పిలుపిచ్చుకొని సమీకృతమయి బరిసెలతోనూ గొడ్డళ్ళతోనూ మాదిగపల్లిని చుట్టుముట్టారు. ట్రాక్టర్ల

మీద, మోటార్ సైకిళ్ళమీద వచ్చారు. చుట్టుముట్టి ఇళ్ళమీద పడి, దాడి మొదలు పెట్టారు. ఇళ్ళ మట్టి గోడలను తూట్లు పొడిచారు. ఫోటోలను పగలగొట్టారు. మనుషులను గొడ్డళ్ళతో నరికి బరిసెలతో పొడిచి చంపారు. తేళ్ళ యేసు, దుడ్డు వందనం, అక్కడికక్కడే చనిపోయారు. దుడ్డు రమేష్ 21నాడు గుంటూరు ఆస్పత్రిలో చనిపోయాడు. దుడ్డు యేసు అతని గర్భవతి అయిన కోడలు కాపాడబోగా ఆమెను పక్కకు తోసి అతన్ని గొడ్డళ్ళతో నరికారు. అతను 22నాడు గుంటూరు ఆస్పత్రిలో చనిపోయాడు.

ఇట్లా దాడి జరగగానే హరిజనులు భయభ్రాంతులయి పొలాలలోకి పారిపోయారు. 70 సంవత్సరాల తేళ్ళ మోషె, తేళ్ళముత్తయ్య ఆ విధంగా పారిపోగా హంతకులు వాళ్ళను పొలాలలోకి తరిమి మహా క్రూరంగా చంపారు. గొడ్డలితో తల నరికి, వెల్లెలికిలా పడిపోగా, పొత్తికడుపులో బరిసెగుచ్చి తిప్పారు. ఈ విధంగా ఆరుగురు చనిపోగా మరొక 20 మందిదాకా గాయాలతో చీరాల గుంటూరు ఆస్పత్రులు చేరారు.

స్త్రీలను గూడ ఈ హంతకులు విడిచిపెట్టలేదు. వాళ్ళ బట్టలు చింపి వాళ్ళతో అసభ్యంగా ప్రవర్తించారు. ముగ్గురు అమ్మాయిల పైన (మరియమ్మ, విక్టోరియా, సులోచన) అత్యాచారం చేసి, పొత్తికడుపు కింద కర్రలతో పొడిచారు. వీళ్ళుగూడా ఆస్పత్రి పాలయ్యారు.

ఈ విధంగా ఒక గంటపైగా భీభత్సం చేసారు. ఈ భీభత్సం జరుగుతూండగానే పోలీసులు వచ్చారని పోలీసుల సమక్షంలోనే కొందరిని హత్య చేశారని హరిజనులంటారు. నిజానికి గ్రామంలోని మాలవాడలో కొంతకాలం క్రితం జరిగిన ఘర్షణల ఫలితంగా ఒక ఇద్దరు జవాన్లు గ్రామంలోనే వున్నారు. అయితే వీళ్లు మారణ కాండను ఆపడానికి ఎటువంటి ప్రయత్నం చేసినట్టు కనిపించదు. ఆ నాడే కాదు, హత్యాకాండ జరిగిన వారం రోజులదాకా జిల్లా పోలీసు యంత్రాంగం చాలా అలసత్వాన్ని ప్రదర్శించింది. శవాల కోసం వెతికే ప్రయత్నం చేయలేదు. (ఎందుకు చేయడం లేదంటే "శవాలు ఉంటే గద్దలూ రాబందులూ తిరుగుతుంటాయి, వెతకనక్కరలేదు" అని జిల్లా ఎస్. పి. గోఖలే గారు అంటారు.) హంతకులు గ్రామంలో ఉన్నారేమో చూడడానికి ఇళ్ళు సోదా చేయలేదు. రైల్వే స్టేషన్ బస్టాండ్ల దగ్గర కాపలా పెట్టలేదు. ఈ హత్యాకాండ కుట్ర పూరితంగా జరిగింది కాబట్టి కుట్ర (సెక్షన్ 120 I P C) పెట్టవలసింది పెట్టలేదు. చివరికి, సంఘటన జరిగి వారం గడిచాక దేశవ్యాపితంగా గొడవ మొదలయ్యాక, హంతకులకోసం గాలింపు మొదలుపెట్టారు. ఇప్పటికి 65 మందిని అరెస్టు చేసినట్టు వినికిడి. కేసు ఎంతబాగా నడుపుతారో ఎంత న్యాయం జరుగుతుందో వేచి చూడవలసిందే.

## మహబూబ్‌నగర్ : భూసంస్కరణలు

అనగనగా ఆదిలాపురం అనేవూళ్ళో, (కల్వకుర్తి తాలూకాలో మహబూబ్‌నగర్ జిల్లాలో), కుందారపు పెదలక్ష్మారెడ్డి, చిన లక్ష్మారెడ్డి, (బహుశా ఇంకా చినలక్ష్మారెడ్డిగూడ) అనే మక్తేదార్లు ఉండేవారు. (సవరణ : ఈ గ్రామాన్ని జనం ఆజిలాపురం అంటారు. అసలు పేరు ఆదిలాపురం అయివుంటుందని మావూహ). మక్తేదార్లు ఉండే వారంటే ఈ "అనగనగా" ఇప్పటిది కాదని, మీర్ ఉస్మాన్ అలీఖాన్ నవాబ్‌గారి నిజాంషాహీ హైద్రాబాద్‌లో నడిచిన రోజని, మీరు ఊహిస్తారు.

అదిరైటే.

ఈ మక్తేదార్లు ముప్పైయో నలభయ్యో గ్రామాల శిస్తు వసూలుచేసి నిజాం నవాబుగారికి అప్పజెప్పే బాధ్యత కలిగివుండే వారు. ఆ బాధ్యతను ఆసరా చేసుకుని (సహజంగానే) వీళ్ళు అదిలాపురంలోనూ సమీపంలోని ఇర్విన్‌లోనూ, ఇర్విన్ క్రిందవున్న (ఆమ్లెట్ లేక hamlet అని ప్రజలంటారు.) ఖిల్వాక్‌ఖాన్‌పల్లిలోనూ 2,000 ఎకరాల భూమి స్వంతం చేసుకున్నారు. నల్లగొండ, వరంగల్ జిల్లాలలోని విసునూరు, డోర్నకల్ తదితర దేశ్‌ముఖ్‌లు 50వేల నుండి లక్షా యాభై వేల ఎకరాల దాక ఆక్రమించుకున్న కథ మీరు విని వుంటే ఇందులో విశేషమేమీ లేదనుకుంటారు.

అదిగూడా రైటే.

అయితే విశేషం ఎక్కడుందంటే (బహుశా ఇందులోగూడ విశేషం లేదేమో) నిజాంషాహీ గడిచి, నెహ్రూశకం గడిచి, ఇందిరా గాంధీ శకంగూడగడిచి ఇప్పుడు అన్న రామన్న శకం మూడవ సంవత్సరంలోగూడ వీళ్ళు 4,200 ఎకరాలను సురక్షితంగాఉంచుకున్నారు.

నెహ్రూ శకంలో ఆంధ్రప్రదేశ్ (తెలంగాణా ప్రాంతం) కౌలు మరియు వ్యవసాయ భూముల చట్టం (1950) అనేది తయారయింది. ఈ చట్టం కౌలుదార్లకు భద్రత కల్పిస్తూ చాలా సంవత్సరాలు ఒకే పొలాన్ని కౌలుకుచేస్తే దాన్ని భూస్వామి ఆ కౌలుదారుకే అమ్మాలని అంటుంది. ఇంత భద్రమయిన కౌలుదార్ల చట్టం దేశంలోనే లేదని ఆనోటా ఈనోటా విన్నాము. పుస్తకాలలో చదివాము. ఇదంతా తాము నడిపిన తెలంగాణా రైతాంగ పోరాటం ఫలితమేనని కమ్యూనిస్టు నాయకులు తమ భుజాలు తాము చరచుకోగాగూడ కన్నాము. చట్టం ఎంత పకడ్బందీగా వున్నా కౌలుదారయిన రైతుకు తాసీల్దారు ఆఫీసులో తన డిక్లరేషన్ ఫైల్‌చేసే దమ్ములుంటేగా చట్టం వర్తించేది ? ఆ దమ్ములు ఎవరికీ లేకపోయాయి. ఒక దురాశాపరుడయిన రైతు ఒకనాడు తెగించి ఆపని చేయబోతే కుందారపు పెద. చిన్న లక్ష్మారెడ్ల వారసుడు కుందారపు మోహనరెడ్డిదొర. అతన్ని తాసీల్దార్ ఆఫీసు తలుపు వద్దనుండి బెదిరించి తరిమేసాడంట.

ఇందిరాగాంధీ శకంలో ఆం. ప్ర. వ్యవసాయ కమతాల గరిష్ట పరిమితి చట్టం (1972) వచ్చింది. భూస్వాముల ఆటకట్టయిందని అందరూ భావించారు. కుందారపు రెడ్లుగూడా తొందర పడ్డారు. చట్టం రాబోతుంది రాబోతుందనగా 101 ఎకరాలు భూదాన్ వారికి ధానం ఇచ్చారు. వారు దానిని 50 హరిజన కుటుంబాలకు పంచి సర్టిఫికేట్లు యిచ్చారు. అయితే 2,000లలో 100 పోతే ఇంకా 1,900 ఎకరాలు మిగిలాయి. వీటిని ఆనాటి మక్తేదార్ల పుత్ర పౌత్ర దౌహిత్ర సముదాయానికీ వారి కళత్రాలకూ అవ్వారి భ్రాతృలకూ మొత్తం 33 మందికి పంచియిచ్చారు. ఈ పంపకం న్యాయమేనని రెవెన్యూ అధికార్లు సర్టిఫికేట్లుగూడా ఇచ్చారు. పోనీ ఈ 33మందీ వ్యవసాయం తప్ప వేరే జీవనాధారం లేని వారా అంటే అదేంకాదు. వాళ్ళలో కుందారపు నరసింహారెడ్డి అనే ఆయన గత 20 ఏళ్ళగా అమెరికాలోవైద్యవృత్తివెలగబెడుతున్నాడట. (అతనుమనరాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డికి వియ్యంకుడన్న చిందబర రహస్యం గూడా గ్రామంలో చెబుతారు) ఇతరులు హైదరాబాద్ తదితర నగరాలలో ఇంజనీరింగ్ తదితర వృత్తులు వెలగ బెడుతున్నారు. ప్రస్తుతం